వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ఆసరా అందక ఆందోళన

- మూడో విడతకు అర్హులైన సభ్యులు 4,18,354
- జమ చేయాల్సిన నగదు రూ.281.24 కోట్లు
- 3,23,911 మందికి రూ.218.93 కోట్లు జమ
- మరో 94,443 మంది ఎదురుచూపులు

స్వయం సహాయక సంఘాల మహిళలకు (ఎస్‌హెచ్‌జి) ఆసరా పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న మూడో విడత రుణమాఫీ సొమ్ము కోసం మహిళలు ముప్పతిప్పలు పడాల్సి వస్తుంది. ఆసరా డబ్బులు 2022 ఏడాది ముగిసే లోపే వస్తాయని భావించారు. డిసెంబర్‌లో అర్హుల వివరాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసినా సొమ్ములు జమ కాలేదు. అక్కడికి మూడు నెలల తర్వాత అంటే ఈ ఏడాది మార్చి 25న ప్రభుత్వం డబ్బులు విడుదల చేసే కార్యక్రమం ప్రారంభించింది. నిధులు విడుదల చేసి 45 రోజులు గడుస్తున్నా డబ్బులు ఇంకా జమ కాలేదు. డబ్బులు ఎప్పుడు జమ అవుతాయా అని మహిళలు ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్వయం సహాయక సంఘాలకు ఆసరా పేరుతో వైసిపి ప్రభుత్వం పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తూ వస్తోంది. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి లింకేజీ రుణాలు తీసుకున్న సంఘాల్లోని సభ్యులకు దీన్ని వర్తింపజేస్తున్నారు. విడతలుగా రుణమాఫీ అమలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు మూడు విడతల మొత్తాన్ని పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాలో 38,647 సంఘాల్లోని 4,31,734 మంది సభ్యులు ఆసరా ద్వారా తొలి విడతగా లబ్ధి పొందారు. వారి ఖాతాల్లో సుమారు రూ.280.36 కోట్లు జమ అయ్యాయి.

మొదటి విడతలో సంఘంలోని సభ్యులందరికీ డబ్బులు ఇచ్చారు. రెండో విడతలో కొన్ని మార్పులు చేశారు. రెండు, మూడు ఖాతాల్లో ఉన్న వారిని, మరణించిన సభ్యులను తొలగించి జాబితాను రూపొందించారు. రెండో విడతలో 38,805 సంఘాల నుంచి 4,18,397 మంది అర్హత సాధించారు. వారికి రూ.282.36 కోట్లను ఇచ్చారు. మూడో విడతలో మరింత వడపోశారు. బయోమెట్రిక్ నమోదు తప్పనిసరి అని నిబంధన విధించారు. బయోమెట్రిక్, బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించారు. గతేడాది డిసెంబరులోనే అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు ఎపిఎంలు, సిసిలు, విఒఎలు గ్రామాల వారీగా ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేశారు.

రూ.62.31 కోట్లు పెండింగ్

మూడో విడత ఆసరాకు 38,792 సంఘాల్లోని 4,18,354 మంది సభ్యులను అర్హులుగా గుర్తించారు. వీరికి రూ.281.24 కోట్లను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు 30,142 సంఘాలకు చెందిన 3,23,911 సభ్యులకు రూ.218.89 కోట్లు జమ చేశారు. ఇంకా 86,650 సంఘాలకు చెందిన 94,443 మంది సభ్యులకు రూ.62.31 కోట్లను ఖాతాల్లో వేయాల్సి ఉంది. ఎచ్చెర్ల మండలంలో అత్యధిక మంది మహిళలకు ఆసరా సొమ్ము రాలేదు. ఇక్కడ 16,578 సభ్యులకు రూ.13.30 కోట్లు ఇవ్వాలి. ఆ తర్వాత స్థానంలో పొలాకి మండలం ఉంది. కొత్తూరు మండలంలో 10,854 మందికి రూ.5.42 కోట్లు ఇవ్వాలి. 15,339 మంది సభ్యులకు రూ.9.71 కోట్లు జమ చేయాల్సి ఉంది. సారవకోటలో 10,740 మందికి రూ.5.75 కోట్లు జమ చేయాల్సి ఉంది. బూర్జలో 9,365 మందికి రూ.5.68 కోట్లు, ఆమదాలవలసలో 9,353 మంది సభ్యులకు రూ.6.68 కోట్ల మేర జమ చేయాల్సి ఉంది.

ఆసరా అందక ఆందోళన

ఆసరా సొమ్ములపై మహిళల్లో నెలకొన్న ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని, ఈ ఏడాది మార్చి 25న ఆసరా సొమ్మును బ్యాంకుల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. నిధులు విడుదల చేసి 45 రోజులు కావస్తున్నా, ఎస్‌హెచ్‌జి మహిళలకు డబ్బులు పడలేదు. సంఘాల ద్వారా రుణాలు తీసుకున్న మహిళలకు వడ్డీ మాఫీ చేస్తానని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రూ.ఐదు వేలో, పది వేలో వస్తే ఏదో కొంత ఆసరాగా ఉంటుందని మహిళలకు భావించారు. ఆసరా సొమ్ము కొందరికి వచ్చి తమకు రాకపోవడంపై మహిళల్లో ఆందోళన నెలకొంది. సొమ్ములు జమ కాకపోవడంపై సమావేశాల్లో ఎపిఎం, సిసిలను అడుగుతున్నారు. ఆసరా డబ్బులు వస్తాయన్న దానిపై వారూ ఏమీ చెప్పలేకపోవడంతో మహిళలు కొంత నిరాశకు గురవుతున్నారు.

జీడికి మద్దతు ధర కల్పించాలి

- బస్తాకు రూ.16 వేలు ఇవ్వాలి
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జీడి పిక్కల 80 కిలోల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో జీడి పంట సాగు చేస్తూ సుమారు 80 వేల కుటుంబాలు జీవిస్తున్నాయని చెప్పారు. ఉద్దానం, తీర, గిరిజన ప్రాంతాల్లో ప్రధాన పంటగా జీడి సాగవుతోందని తెలిపారు. సాగుకు అవసరమైన పెట్టుబడి రోజురోజుకూ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అష్టకష్టాలు పడి సాగు చేసిన జీడి పంటకు వ్యాపారులు గిట్టుబాటు ధర చెల్లించడం లేదన్నారు.

ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రైతుల భరోసా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పంట చేతికి వచ్చే సమయంలో ధర తగ్గించి రైతుల వద్ద కారుచౌకగా కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మొన్నటివరకు 80 కేజీల బస్తా రూ.11 వేలు ఉంటే ప్రస్తుతం రూ.7,500 నుంచి రూ.ఎనిమిది వేలకు తగ్గించి, ఇప్పుడు కొనుగోళ్లు నిలిపివేశారని చెప్పారు. వ్యాపారులు ఉత్పత్తి చేస్తున్న జీడిపప్పు ధర పెరుగుతున్నా, రైతులకు న్యాయం చేయడం లేదన్నారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్‌ను, ప్రాంతాల వారీగా జీడి పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న జీడిపళ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జీడి సాగు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పి.చంద్రరావు, కె.సింహాచలం, ఎం.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సైకిల్ ర్యాలీ

శ్రీకాకుళం : జూన్ ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్)లో భాగంగా పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 16వ తేదీన సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎస్.శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు డేఅండ్‌నైట్ కూలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారని నగర ప్రజలు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేతన ఒప్పంద ప్రకటన చేస్తున్న సురేష్ కుమార్

జీడి కార్మికుల చర్చలు సఫలం

వేతన పెంపునకు వ్యాపారుల అంగీకారం

ప్రజాశక్తి - పలాస

జీడి కార్మికులు, వ్యాపారుల మధ్య సోమవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. గత వేతన ఒప్పందంలో పెంచిన 12 శాతంపై అదనంగా ఒక శాతం పెంచేందుకు యజమానులు అంగీకరించారు. పిక్కలు ఎత్తే పురుష కార్మికులకు అదనంగా వేతనం చెల్లించేందుకు వేతన ఒప్పందం కుదిరింది. స్థానిక పిసిఎంఎ కార్యాలయంలో సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జీడి కార్మిక సంఘ నాయకులు, జీడి వ్యాపారుల మధ్య సుదీర్ఘంగా చర్చలు సాగాయి. ఇప్పటికే రెండుసార్లు జరిగిన చర్చలు విఫలం కాగా, సోమవారం జరిగిన చర్చలు ఫలించకపోతే కార్మికులు మంగళవారం నుంచి బంద్‌కు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని చర్చల్లో కార్మిక సంఘ నాయకులు స్పష్టం చేశారు. చివరకు గతంలో పెంచిన 12 శాతంపై ఒక శాతం పెంచేందుకు వ్యాపారులు అంగీకరిస్తూ రెండేళ్లకు వేతన ఒప్పందం కుదుర్చుకున్నారు. జీడి వ్యాపారుల సంఘం అధ్యక్షులు మల్లా సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన చర్చల్లో పిసిఎంఎ కార్యదర్శి కె.వి శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, వ్యాపారులు శాసనపురి మురళీకృష్ణ, మల్లా భాస్కరరావు, కొత్తకోట తిరుమలరావు, ఎస్.సతీష్, జీడి కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.భీమారావు, బొమ్మాళి తాతయ్య, మాజీ అధ్యక్షులు బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'యువగళం'తో వైసిపిలో వణుకు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో వైసిపిలో వణుకు మొదలైందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. యువగళం పాదయాత్ర 100 రోజులకు చేరుకున్న సందర్భంగా సంఘీభావ పాదయాత్రను సోమవారం స్థానిక పారిశ్రామికవాడ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం నుంచి పట్టణంలోని మెయిన్ రోడ్డు మీదుగా కృష్ణాపురం కూడలి అక్కడ్నుంచి రైల్వే గేట్ మీదుగా మెట్టక్కివలస మీదుగా తిరిగి పారిశ్రామికవాడ వరకు చేపట్టారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఇటీవల టిడిపిలో చేరిన బూర్జ మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్‌ను టిడిపి నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. అది చూసి వైసిపి నాయకులు ఓర్వలేక పలు ఆంక్షలు విధిస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో లోకేష్ కొత్త ట్రెండ్‌ను సృష్టించారని, అదే సెల్ఫీ చాలెంజ్ అని అన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిని సెల్ఫీల ద్వారా వైసిపి ప్రభుత్వానికి చూపిస్తున్నారని చెప్పారు. దాన్ని ఓర్వలేని వైసిపి నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. వైసిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఎక్కడా కనబడడం లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడమే కార్యకర్తల కర్తవ్యమన్నారు. వంద కిలోమీటర్ల పాదయాత్రకే వైసిపి నాయకుల చెడ్డీలు తడిసిపోతున్నాయని, నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయితే వైసిపి కనుమరుగు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పీరుకట్ల ప్రభాకరరావు, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్ర చేస్తున్న రవికుమార్, టిడిపి శ్రేణులు

ఎపి ఇఎపిసెట్ పరీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం ప్రతినిధి : ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎపి ఇఎపిసెట్ ఆన్‌లైన్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 19 తేదీ వరకు ఎంపిసి గ్రూపు వారికి, 22, 23 తేదీల్లో బైపిసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు జిల్లాలో మూడు కేంద్రాలు కేటాయించారు. ఎచ్చెర్లలో రెండు, టెక్కలిలోని ఒక కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. రెండు షిఫ్టులుగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకు రెండో షిఫ్టులో పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు రెండు షిఫ్టుల్లో కలిపి 1,220 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,178 మంది హాజరయ్యారు. పరీక్షలకు 42 మంది హాజరు కాలేదు. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టుకు 190 మందిని కేటాయించగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్టులోనూ అదే సంఖ్యలో విద్యార్థులను కేటాయించగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు మొదటి షిఫ్టులో 190ని కేటాయించగా ఏడుగురు, రెండో షిఫ్టులో ఇద్దరు పరీక్షలకు రాలేదు. టెక్కలి ఐతమ్ కళాశాలకు 230 మందిని కేటాయించగా, 12 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్టుకు 11 మంది గైర్హాజరయ్యారు.

ముగిసిన గ్రామ దేవత ఉత్సవాలు

ఇచ్ఛాపురం : నెల రోజులుగా నిర్వహించిన స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు సోమవారంతో ముగిశాయి. ప్రధాన ఆలయం నుంచి గత నెల 17వ తేదీన ఉప్పలవీధి ఉత్సవ మండపం వద్ద అమ్మవారిని కొలువు తీర్చారు. నాటి నుంచి 16 రోజుల పాటు పట్టణంలోని అన్ని వీధుల్లో అమ్మవారి తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత రథంవీధి, దాసన్నపేట వద్ద సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు సోమవారం ఉత్సవ మండపం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఉప్పలవీధిలో తిరువీధి, రథంవీధి, దాసన్నపేట మీదగా ఊరేగింపుతో రాత్రి 11 గంటల తర్వాత ప్రధాన ఆలయానికి అమ్మవారిని తీసుకెళ్లారు. భారీ స్థాయిలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రశాంతంగా ఉత్సవాలు ముగియడంతో పోలీసులు, కమిటీ సభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సంబరాల సందర్భంగా రోజూ రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈనెల 14వ తేదీన రాత్రి పల్సర్ బైక్ రమణ, జబర్దస్త్ నటులతో సాగిన కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ద్విచక్ర వాహనాలు తిరగలేక ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

విద్యారంగంలో సమూల మార్పులు

ప్రజాశక్తి- పొందూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులను తీసుకొచ్చారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివిలో రూ.1.60 కోట్లతో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల తరగతి గదుల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను చేపట్టడం ద్వారా దేశంలోనే విద్యారంగంలో రాష్ట్రం పురోగతి కనబరించిందన్నారు. బాలికలు విద్యలో రాణించినప్పుడే ఉన్నతమైన సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. కెజిబివి పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అన్నిరకాల మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పూర్తిస్థాయి బోధనా సిబ్బంది నియామకాలు, పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం, మెనూ వంటి విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని పొందూరులో నాడు-నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణకు ప్రాధాన్యతను ఇచ్చామని, అధికారుల తీరుతో ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సకాలంలో పనులను పూర్తిచేయకపోతే సంబంధిత అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు.

సభ నిర్వహణ తీరుపై ఆగ్రహం

పాఠశాల భవనం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభ నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతికి బదులుగా ఆంధ్ర రాష్ట్ర సభాపతిగా ముద్రించడంపై మండిపడ్డారు. సభా వేదికపై ప్రొటోకాల్ పాటించకపోవడంతో పాటు స్టేజ్ పైకి వెళ్లాక మైక్ పనిచేయకపోవడంతో, సభా నిర్వహణ ఇలాగేనా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు నివేదించాలని ఆదేశించారు. పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గడంపై అసహనం వ్యక్తం చేశారు. సభా వేదికపై నుంచి కిందకి దిగి విలేకరుల సమావేశం నిర్వహించి వెనుదిరిగారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు, కెజిబివి ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, గాడు నాగరాజు పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, ఎంపిటిసి ఎల్.లక్ష్మంనాయుడు, ఎస్ఎస్ఎ డిఇ ఎన్.వెంకటేశ్వరరావు, జెఇ జగదీష్, నాడు-నేడు జెఇ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 180 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 180 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వినతులను స్వీకరించారు. పొన్నాం గ్రామానికి చెందిన అన్నదమ్ములు వెంకటరావు, నాగరాజు తమ భూమిని వాటాలుగా పంచుకుని వాటిని వేరు చేయాలని స్పందనలో దరఖాస్తు చేస్తే, శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయం నుంచి సమస్యకు పరిష్కారం చూపకుండా సమగ్ర భూసర్వే సమయంలో మార్చుకోవాలని లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. నరసన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న కాలనీలతో పాటు ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపులో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ పలువురు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షల్లో కొంత మొత్తం సంబంధిత అధికారులు అడుగుతున్నారని, ఇవ్వకపోవడంతో బిల్లులు అప్‌లోడ్ చేయడం లేదని చెప్పారు. గార మండలం కళింగపట్నంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు కలెక్టర్‌ను కోరారు. వీటితోపాటు పలు సమస్యలపై వినతులు వచ్చాయి.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

స్పందన కార్యమానికి ఉన్నతాధికారులు గైర్హాజరుపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు కాని అధికారులు లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, మెప్మా పీడీ కిరణ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తిస్థాయి మరింత పెరగాలి

- వ్యక్తిగత ఫిర్యాదులకూ ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా చేసుకున్న సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి స్థాయి మరింత పెరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. స్పందన, ఎపి పోర్టల్ సేవా, జగనన్నకు చెబుదాంపై జిల్లా, డివిజనల్, మండలస్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించిన తర్వాత నేటివరకు జిల్లా నుంచి 88 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో 82 మందికి కాల్స్ వెళ్లగా, వారిలో 51 మంది స్పందించారని చెప్పారు. అందులో 14 మంది సంతృప్తి చెందినట్లు ప్రతిస్పందించారని తెలిపారు. జిల్లాలో ఆరు వేల మంది కార్యదర్శులు, 15 వేల మంది వాలంటీర్లు వెరశి 21 వేల మంది పనిచేస్తున్నారని చెప్పారు. ఇంతమంది పనిచేస్తున్నా ఏదో ఒక స్థాయిలో సమస్య పరిష్కారం కానందునే అర్జీదారు సంతృప్తిని వ్యక్తం చేయడం లేదన్న సంగతిని అధికారులు గుర్తెరగాలన్నారు. సంతృప్తి వ్యక్తం చేయని 37 మందిలో 12 శాఖలు ఉన్నాయని, ఆయా శాఖాధికారులు, సిబ్బంది బాధ్యత తీసుకుని సమస్యలు పరిష్కరించి అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచాలని సూచించారు. అర్జీదారుల వ్యక్తిగత సమస్యలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలనేది దీని ముఖ్య ఉద్దేశమన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని కోరారు. ఇకపై వారంలో ఒక రోజు మండలస్థాయి బృందంలోని అధికారులందరూ సమావేశమై అర్జీదారుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఇకపై ప్రతి బుధవారం సమీక్షిస్తామని, వచ్చే వారం నుంచి సంతృప్తి స్థాయి పెరగని సంబంధిత మండల అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండలాల్లో నిర్వహించే స్పందనలో అధికారులు గైర్హాజరవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై అటువంటివి పునరావృతమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని, తప్పనిసరి పరిస్థితిల్లో ఇతర కార్యక్రమాలకు హాజరు కావాల్సి వస్తే ఆ వివరాలను ముందుగా తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. 1902 నంబరుకు ఫిర్యాదులు వెళ్లాయంటే అధికారుల అలసత్వమే కారణమన్న సంగతిని గ్రహించాలన్నారు. ప్రతి ఫిర్యాదు గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో పరిష్కారం కావాల్సిందేనని, ఆ విషయాన్ని ప్రతి అధికారి లేదా సిబ్బంది గుర్తించాలని కోరారు. జగనన్నకు చెబుదాంలో అధికంగా ఫిర్యాదులు వచ్చే డివిజన్లు, మండలాలు, సచివాలయాల వివరాలు సేకరించి పరిష్కారం చూపని, సంతప్తి స్థాయిని పెంచని అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, డిఎస్‌పి వై.శృతి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పి రాధిక

ఎస్పి 'స్పందన'కు 42 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎస్పి 'స్పందన' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించి నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ మండలాల ప్రజల నుంచి సోమవారం ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 42 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. మోసపూరితమైన ఫిర్యాదులు 3, కుటుంబ తగాదాలకు సంబంధించినవి 3, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదు 8, పౌర సంబంధాలపై 7, పాత ఫిర్యాదులు 9, తదితరవి 12 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎఎస్పి విఠలేశ్వరరావు, వి.ఎస్.మణికంఠ పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం

ఆమదాలవలస : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచే ఉద్దేశంతో మంజూరు చేసిన నాడు-నేడుతో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఇఒ దుప్పల రామారావు, విద్యా సంక్షేమ అధికారి, ఎపిఎం పూడి కూర్మారావు అన్నారు. మండలంలోని కనుగులవలస, వంజంగి, వెదుళ్లవలస పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి తరగతుల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా పనులు చేపట్టాలన్నారు.

మాట్లాడుతున్న చిన్నంనాయుడు

ఉపాధ్యాయులకు శిక్షణ

పలాస : శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేర్చుకున్న అంశాలు తరగతి గదిలో అమలు పరచాలని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోర్స్ డైరెక్టర్ వై చిన్నంనాయుడు అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో 1998 క్వాలిఫైడ్ టీచర్లు, 2018, 2008లో విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ పేరిట ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణలో తెలుగు, ఇంగ్లీషు, పరిసరాల విజ్ఞానం, గణితం, విద్యాహక్కు చట్టం, నూతన విద్యా విధానం, పాఠశాల తరగతి గది నిర్వహణ, సాంకేతిక వనరుల వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్‌పర్సన్లు జి.వి. రమణ, ఎల్.వెంకటరావు, ఆర్.రమణమూర్తి, కె.వి.రమణ, బి.వి.రమణ, సిహెచ్.సందీప్, మల్లేశ్వరరావు, డైట్ అధ్యాపకులు ఎ.వేణుగోపాలరావు, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత ఎ.మధుబాబు, కొయ్యల శ్రీనివాసరావు, పీడీ కె.హరిబాబు పాల్గొన్నారు.

'యువగళం' సంఘీభావ పాదయాత్ర

శ్రీకాకుళం అర్బన్ : పాదయాత్రలో పాల్గొన్న లక్ష్మీదేవి

ఇచ్ఛాపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర వంద రోజులకు చేరుకున్న సందర్భంగా మండలంలోని తీర ప్రాంత గ్రామ బూర్జపాడులో సంఘీభావ పాదయాత్రను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. అక్కడ నుంచి కార్యకర్తలతో నినాదాలు చేస్తూ... కేసుపురం, ఈదుపురం, కొళింగ, తులసిగాం, ఇన్నీసుపేట వరకు పాదయాత్ర చేశారు.

పలాస : పలాస నియోజకవర్గంలో పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు చేసిన అవినీతి నిరూపించేందుకు నేను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ సవాల్ విసిరారు. లోకేష్ పాదయాత్ర 1250 కిలోమీటర్లు, వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. టిడిపి కార్యాలయం నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నా రాజకీయ చరిత్రలో ఎవరి పాట కొట్టలేదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, జోగ మల్లి, దొక్కరి శంకర్, ఆత్మారావు, సైల చక్రధర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నాయకులు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. ఈ మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి సంతబొమ్మాళి మండలం పాలేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షులు బాగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్, రెడ్డి అప్పన్న, బోయిన రమేష్, పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలో టిడిపి నాయకులు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. నగరంలోని సూర్యమహల్ కూడలి నుంచి ఐలగ వరకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా సూర్యమహల్ కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పూలమాలలు వేసిన పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు జామి భీమశంకరరావు, రెడ్డి నాగభూషణం, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.

రణస్థలం : లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నాయకులు, పొందూరు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

కొత్తూరు : లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సంఘీభావ పాత్ర నిర్వహించారు. ఈ మేరకు మెట్టూరు బిట్-1 నుంచి కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వరకు ఐదు కిలో మీటర్ల మేరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, పాతపట్నం మోహనరావు, అగతముడి అరుణ్‌కుమార్, జి.కమలాకర్, అచ్యుతరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు

కొత్తూరు : పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు

రణస్థలం : కేక్‌ను కట్ చేస్తున్న అప్పలనాయుడు

ఇచ్ఛాపురం : పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

పలాస : సంఘీభావ పాదయాత్రలో పాల్గొన్న శివాజీ

యువగళం చారిత్రాత్మకం

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకోవడం ఓ చారిత్రాత్మక ఘట్టమని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలోని సోమవారం విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ.. వారి సమస్యల పరిష్కారానికి భరోసా ఇస్తూ లోకేష్ ముందుకు సాగుతున్నారన్నారు. మొదటి వంద రోజుల్లోనే 1,269 కిలోమీటర్ల మైలురాయిని అధిగమించి పాదయాత్ర కొనసాగించారన్నారు. ఇప్పటి వరకూ 32 బహిరంగ సభలు నిర్వహించారని తెలిపారు.

'ఉపాధి' హామీని కాపాడుకుందాం

ప్రజాశక్తి- బూర్జ

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఉపాధి కూలీలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగవరపు ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రం బూర్జలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలల బకాయిలను కూలీలకు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఆమదాలవలస మండలం మండాదిలో ఇటీవల లారీ ప్రమాదంలో మృతి చెందిన నలుగురు ఉపాధి కూలీల కుటుంబాలకు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల కూలీలకు ఉపాధి హామీ చట్టం ప్రధానమైన వనరు అని అన్నారు. పనులు బాగా కల్పించిన చోట వలసలు తగ్గాయని పేర్కొన్నారు. పేదల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. చిన్న, సన్న కారు రైతులు భూముల అభివృద్ధి చెందుతున్నాయని అనానరు. చెరువుల్లో పూడికలు తీతల వల్ల భూగర్భ జలాలు పెరిగినట్లు ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయని అన్నారు. ఉపాధి హామీ గ్రామీణ పేదలకు ఒక వరం లాంటిదన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

వృత్తి శిక్షణను వినియోగించుకోవాలి

ఆమదాలవలస : కొబ్బరి చెట్టు ఎక్కే యంత్రాలపై ఆరు రోజులు పాటు నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవనాధికారి ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో మొదటి రోజు సోమవారం కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరి రైతులకు ఈ శిక్షణా కార్యక్రమం వృత్తిని కల్పిస్తుందని అన్నారు. అలాగే కోతను సులభతరం చేస్తుందని తెలిపారు. కెవికె ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వృత్తి శిక్షణ రెండు పద్ధతుల ద్వారా సాంకేతిక విజ్ఞానాన్ని నిపుణుల ద్వారా తెలియజేయడంతో పాటు ప్రాక్టికల్ పద్ధతిలో యంత్రాల ద్వారా కొబ్బరి చెట్లు ఏ విధంగా ఎక్కాలో తెలియజేశారు.

మాట్లాడుతున్న ప్రసాద్

సింహాచలం మృతదేహం

వడదెబ్బకు వ్యక్తి మృతి

పలాస : కాశీబుగ్గ శ్రీనివాసనగర్‌లో సోమవారం వడదెబ్బకు గురై సుంకరి సింహాచలం (39) మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు, మృతుడు అన్నయ్య కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు భార్య విజయలక్ష్మితో గొడవ పడి ఆరేళ్లుగా ఒంటరిగా ఉంటున్నాడు. మృతుడు పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజులుగా ఇంటికి రాకుండా మద్యం మత్తులో జోగుతున్నట్లు తెలుస్తోంది. భోజనం చేయక మత్తులో జోగుతూ ఎండలో పడి ఉండటంతో వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మతుని భార్య ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ రూరల్ సిఐ శంకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ములపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని కృష్ణపురానికి చెందిన బొల్ల లక్ష్మణరావు, బొల్ల సన్యాసిరావులు అనే అన్నదమ్ములు ఆస్తి కోసం తగాదా పడ్డాడు. తల్లి పొలం వాటాలు వేయటంలో ఇద్దరూ ఘర్షణ పడ్డాడు. అనంతరం పరస్పరంగా ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీరాములు

ఆరుగురిపై బైండోవర్ కేసు

పోలాకి : పోలాకి పంచాయతీ రుంకుపేటకు చెందిన ఆరుగురుపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ శ్రీరాములు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో రుంకుపేటకు చెందిన ఒక గ్రూపునకు చెందిన తూలుగు రాకేష్, తూలుగు నర్సింగరావు, సీపాన కోటీశ్వరావు, సీపాన రామారావు, రెండో గ్రూపునకు చెందిన తూలుగు రామకృష్ణ, డోల రమణలు ఇటీవల కొట్లాటకు దిగారు. వీరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి తహశీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మీ పై గతంలోనూ గొడవలు పడి కేసులు ఉన్నాయని, మళ్లీ మీరు ఘర్షణ పడితే రూ.లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఒకే గ్రామంలో ఇలా గొడవలు పడటం మంచిది కాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

నిజాయితీకి సన్మానం

పలాస : పలాస ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న కండక్టర్ ఆర్.వి.రావు, డ్రైవర్ ఎన్.హెచ్. ప్రసాద్‌కు మేనేజర్ శ్రీనివాసరావు సోమవారం సన్మానించారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపెల్లికి చెందిన శోభారాణి ఈ నెల 12న విశాఖపట్నం కాంప్లెక్స్‌లో ఆర్‌టిసి బస్సు ఎక్కి పలాస బయలుదేరారు. తనతో పాటు ప్రయాణికురాలు రూ.35 లక్షలు విలువైన 50 తులాల బంగారంతో నలుపు రంగు హ్యాండ్ బ్యాగ్‌ను తీసుకొచ్చింది. విశాఖ డిపోలోనే కండక్టర్, డ్రైవర్‌కు చెప్పకుండా కూల్ డ్రింక్ కోసం దిగిపోయింది. ఇంతలో బస్సు బయలుదేరి వెళ్లిపోవడంతో ప్రయానికురాలు లబోదిబోమంటూ కన్నీరుమున్నీరైంది. దీన్ని గమనించిన టెక్కలి డిపో కండక్టర్ ధనుంజయ వివరాలు తెలుసుకుని పలాస డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్‌కు ఫోన్‌లో విషయాన్ని తెలియజేశారు. సమాచారం అందుకున్న అసిస్టెంట్ మేనేజర్ సర్వీస్ కండక్టర్‌కు సమాచారం తెలియజేసి లగేజీ బాగ్ వివరాలు ఆరా తీశారు. లగేజ్‌ని కండక్టర్ భద్రపరిచి పలాస డిపోకు జాగ్రత్తగా తీసుకొచ్చి అప్పగించారు. ఇటీవల లగేజీ బాగ్‌ను డిపో మేనేజర్ శ్రీనివాసరావు సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ గురుగుబల్లి రామ్మోహన్, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్ సమక్షంలో శోభారాణికి అప్పగించారు. ఈ సందర్భంగా కండక్టర్, డ్రైవర్లకు అధికారులు, ప్రయాణికులు అభినందించారు.

విజేతలను అభినందిస్తున్న వేణుగోపాల్

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలు

శ్రీకాకుళం అర్బన్ : క్రమశిక్షణతో పనిచేయడం, నైపుణ్యాలను అధ్యయనం చేయడం, క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి చేరుస్తుందని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగరంలోని అఫీషియల్ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో ధ్రువీకరణ, మెడల్స్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్ద కాలంగా సిక్కోలు మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించారని అన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రముఖ వాణిజ్యవేత్త హనుమంతు కృష్ణారావు, సతీమణి హనుమంతు తులసమ్మ చేతుల మీదుగా క్రీడాకారులకు ధ్రువపత్రాలను, మెడల్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో సాయిబాబా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నగిడాపు చంద్రరావు, కోచ్‌లు గాయత్రి, సాయిలక్ష్మి, డాక్టర్ రాధ, డి.హైమ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

నగరంలోని ఇందిరా విజ్ఞాన భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో 25 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 9 మంది బంగారు పతకాలు, నలుగురు సిల్వర్ మెడల్స్, 12 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో సిహెచ్.గౌతమి, కె.అన్సాహ్, జి.జగదీప్రామకృష్ణ దేవ్, డి.కిరణ్, ఎ.రేవంత్, జి.గౌతమ్, సిల్వర్ మెడల్స్ సాధించిన వారిలో డి.కిరణ్, ఎ.సాత్విక్, డి.గౌతమ్, బ్రాంజ్ మెడల్స్ సాధించినవారిలో ఎ.అన్సాహ్, ఎన్.సీరజ్, కె.గౌతమ్‌కుమార్, ఆర్.హరీష్, ఎ.సందీప్, బి.లితిన్, ఎం.దేవాన్ష్, బి.ప్రణీత్, ఎ.రేవంత్ ఉన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

కుసుంపురంలో అన్నదానం

కవిటి: మండలంలోని కుసుంపురంలో నిర్వహిస్తున్న హరేకృష్ణ హరేరామ మహామంత్ర యజ్ఞంలో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొంటున్నారు. అలాగే గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం ఆధ్వర్యాన నాలుగు రోజులుగా యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఎమ్మెల్యే బెందాలం అశోక్ దర్శించుకున్నారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి ఆలయంలో ఉషా, ఛాయ, పద్మినీ సమేతుడైన సూర్యనారాయణ స్వామి కళ్యాణం సోమవారం వైభవం నిర్వహించారు. వైశాఖ బహుళ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకర శర్మ కళ్యాణం నిర్వహించారు. గోవిందరావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

రణస్థలం రూరల్: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ దేవునిపాలవలస రెవెన్యూలో సర్వే నంబరు 31లో 19 ఎకరాల గుండం చెరువు, దేవునిపలవలస రెవెన్యూలో సర్వే నంబరు 28లో 13.28 ఎకరాల సుబ్బమ్మ చెరువు ఆక్రమణ గురయ్యాయని, ఆక్రమణలు తొలగించాలని ఆయా గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలకు గురికావడంతో చెరువులో నీరు నిల్వ ఉండడం లేదని వాపోయారు. దీంతో పశువులకు, మేకులకు జీవనాధారం కోల్పోతున్నాయని అన్నారు. చెరువులు చిన్నవి కావడంతో నీరు త్వరగా ఎండిపోతున్నాయని తెలిపారు. ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న డి.పాలవలస గ్రామస్తులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

టెక్కలి : టెక్కలి సత్య మార్షల్ ఆర్ట్స్ కరాటే శిక్షణా కేంద్రానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని నిర్వాహకులు సత్య, కోచ్ ఉర్జాన దుర్గాప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న డి.ప్రవల్లేష్ బంగారు పతకంతో పాటు, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని, డి.లోకేష్, సిల్వర్ మెడల్, వి.రాజు, బంగారు, కె.గిరిచరణ్ బంగారు, వెండి పతకాలు సాధించారని తెలిపారు. ఆయా విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థుల ప్రతిభను నిర్వాహకులు అభినందించారు.

టిడిపి నాయకులకు కొమ్ము కాస్తున్నారు

ధర్నా చేస్తున్న వైసిపి నాయకులు

పోలీసులపై కృష్ణచైతన్య ధ్వజం

ప్రజాశక్తి- పోలాకి

పోలీసులు ప్రజలకు సంరక్షకులు, సేవకులుగా ఉండాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి పదేపదే చెబుతుంటే... పోలాకి పోలీసులు మాత్రం సమస్యలు సృష్టిస్తున్నారని జెడ్‌పిటిసి, బిసి సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం మధ్యాహ్నం పోలాకి పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టేషన్‌లో పోలీసుల తీరు టిడిపి నాయకులకు అమ్ముడుపోయి వారి ప్రజాకంటక చర్యలకు అండగా నిలిచేలా దిగజారారని విమర్శించారు. ఎప్పటి నుంచో స్థానిక ఎస్ఐ ఇదే రీతిలో వ్యవహరిస్తున్నారని అన్నారు. తాజాగా వనవిష్ణుపురంలో యాదవ కులస్థుల ఇళ్ల ముందు టిడిపి నాయకులు పెద్దపెద్ద డీజేలతో గత రాత్రి ధ్వని కాలుష్యాన్ని సృష్టించి, వారి ఇళ్లల్లోకి బాణసంచా బాంబులు విసిరి భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు నామమాత్రంగానైనా పట్టించుకోలేదని తెలిపారు. ప్రాణహాని ఉందని మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు అంపలాం, పిన్నింటిపేట గ్రామాల్లో వైసిపి కార్యకర్తలపై, వారి కుటుంబాలపై టిడిపి నాయకులు వ్యక్తిగత కక్షతో దాడులు చేసినా కేసులు నమోదు చేయకుండా... దాడులు చేసినవారికే అండగా నిలిచారని ఆరోపించారు. కొత్తరేవు పంచాయతీలో వికలాంగురాలిపై కొందరు వేధింపులకు గురిచేసి, దాడి చేశారని అన్నారు. ఆమె ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్‌కు రోజుల తరబడి తిరగారని, దోషులకే భరోసా ఇచ్చారని అన్నారు. పోలీసులు పూర్తిగా అవినీతిమయం అయిపోయిందని ఆరోపించారు. శాంతి భద్రతలు పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కృష్ణదాస్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఉన్నతాధికారులు వచ్చి స్థానిక పోలీసుల అక్రమాలపై విచారణ జరిపేవరకూ ధర్నా కొనసాగుతుందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న నరసన్నపేట సిఐ చేరుకుని నేతలను బుజ్జగించే ప్రయత్నం చేశారు.

సంక్షిప్త వార్తలు

'ఎన్ఇఆర్'కు పితృవియోగం

అప్పలకొండ (ఫైల్)

రణస్థలం రూరల్ : బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఛైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు తండ్రి నడుకుదిటి అప్పలకొండ (85) సోమవారం మృతి చెందారు. బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో తన స్వగృహం వద్ద రెండు క్రితం అనారోగ్యానికి గురయ్యారు. సోమవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిసర ప్రాంతం ప్రజలు అప్పలకొండ చివరగా చూసేందుకు తరలివచ్చారు.

'నాడు-నేడు' పనులు ప్రారంభం

బూర్జ : మండలంలో ఓ.వి.పేట ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు నాడు-నేడు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఓ.వి.పేట ఉన్నత పాఠశాలలో రూ.51 లక్షలతో నాడు-నేడు పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ పనులు వేగవంతంగానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, ఉపసర్పంచ్ ప్రతినిధి ఇసాయి వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ ఇ.పి.చిన్నారావు, పాఠశాల హెచ్ఎం సిహెచ్.నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి సిజిఎల్ పరీక్షలో మణిదీప్ ప్రతిభ

మణిదీప్

పొందూరు: పొందూరు ఎఎస్ఐగా పనిచేస్తున్న సువ్వారి రామచంద్రరావు కుమారుడు సువ్వారి మణిదీప్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లో ప్రతిభను కనబరిచి కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మణిదీప్ కాకినాడ జెఎన్‌టియులో బిటెక్ ఇఇఇ చదివాడు. ఈ ఎస్ఎస్‌సి కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలో 390 మార్కులకు గాను 330 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈయన ప్రస్తుతం ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటలో నివాసం ఉంటున్నారు. మణిదీప్ ఈ ఉద్యోగానికి ఎంపిక కావడంపై ఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

'స్పందన'కు 25 వినతులు

టెక్కలి : టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 25 వినతులు వచ్చాయని సబ్ కలెక్టర్ టిరాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. వీటిలో ఆధిక శాతం ఇళ్ల పట్టాలు, స్థలాల కోసం వినతులు అందాయని తెలిపారు. జయకృష్ణాపురం శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరారు. మూతబడిన రావివలస ఫెర్రో ఆల్లాయిస్ పరిశ్రమను తెరిపించాలని యూనియన్ నాయకుడు పిట్ట గంగయ్య వినతిపత్రం ద్వారా కోరారు. స్పందనలో వచ్చిన అర్జీలన్నీ ఆయా శాఖల ఆధికారులకు సమాచారం అందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

కిడ్నీ బాధితులకు అండ

కవిటి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కవిటికి చెందిన గేదెల కోదండరావు, సిద్ధాబత్తుల రామస్వామిలకు మండలానికి చెందిన అబ్దుల్ కలాం ఫౌండేషన్ అండగా నిలిచింది. వీరి దయనీయ పరిస్థితి తెలుసుకుని ఫౌండేషన్ సభ్యులు సోమవారం వీరిద్దరికీ చెరో రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన కొదండరావు, రామస్వామిలు కిడ్నీ వ్యాధికి గురవడంతో వారి కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని, దాతలు ఉదారంగా స్పందించి వీరిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.సోమేశ్వరరావు, బాలక శ్రీనివాసరావు, చిట్టిబాబు, భగవాన్ బెహరా, ఎం.రవి, ఎ.లింగరాజు, జి.రాంబాబు, ఎల్.విశ్వేశ్వరరావు, గేదెల జానకిరావు, పి.ఉమాపతి, కె.లింగరాజు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పిడిఎస్ బియ్యం పట్టివేత

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారిలో ఉన్న చీపుర్లపాడు సమీపంలో వసంతలక్ష్మి మోడరన్ రైస్‌మిల్లులో అక్రమంగా ఉన్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని డిటి కె.రాము తెలిపారు. విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరాలశాఖ అధికారులు సంయుక్తంగా రైస్‌మిల్లును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉన్న 432 బస్తాల్లోని 21.970 కిలోల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారని అన్నారు. పట్టుబడిన బియ్యాన్ని లక్ష్మీగణపతి మోడరన్ రైస్‌మిల్లు వద్ద భద్రపర్చినట్లు తెలిపారు. ఈ మేరకు రైస్ మిల్లు ఓనర్ బోయిన కృష్ణారావుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడులో విజిలెన్స్ అధికారులు కె.అప్పన్న, రామ్మోహన్, రమేష్, లక్ష్మీనారాయణ, మురళి పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్ : ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ రుగ్మతల నుంచి బయటపడేందుకు నడక ఎంతో ఉపయోగకరమని స్టార్ వాకర్స్ జిల్లా గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. నగరంలోని కంపోస్టు కాలనీలో ఉన్న విశ్వబ్రాహ్మణ సామాజిక భవనంలో సూర్య వాకర్స్‌క్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. సూర్య వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బెవర శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా డి.ఎల్.నారాయణ, సెక్రటరీ గా సంజీవి నలినీ సుధాకర్, కోశాధికారులను ఎన్నుకున్నారు.